క్లుప్తంగా

ఎన్నికల విధులు, ఈవీఎంలపై అవగాహన అవసరం

- పీఓ, ఏపీఓ, పోలింగ్ సిబ్బంది శిక్షణలో కలెక్టర్ నివాస్



పీఓ, ఏపీఓల శిక్షణలో ఈవీఎంలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నివాస్

కాకినాడ రూరల్: ఎన్నికల విధులు, ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని పీఓ, ఏపీఓ, సిబ్బందికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు జె.నివాస్ సూచించారు. కాకినాడ రూరల్ నియోజకవర్గానికి సంబంధించి రెండో దశ పీఓ, ఏపీఓ, సిబ్బందికి రమణయ్యపేట ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల పనితీరు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా శిక్షణలో తర్ఫీదు పొందాలన్నారు. అనంతరం పోలింగ్ సిబ్బందికి సిద్ధం చేసిన భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్వో ఇట్ల కిశోర్, డీఎల్‌డీఓ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

కరప: మండల పరిధిలో మరో ఏడుగురు వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఎంపీడీఓ కె.అప్పారావుకు పత్రాలను సమర్పించారు. వీరితో వలంటీర్ల రాజీనామా 56కు చేరుకుంది. కరప–1 నుంచి ఐదుగురు, కరప–2 నుంచి ఒకరు, వాకాడ నుంచి ఒకరు చొప్పున వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ అప్పారావు తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన శుక్రవారం జరగనుంది. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు మందిరంలో ఉదయం 10.30 గంటలకు జరగనున్న సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని ఎండీపీఓ రమేష్‌నాయుడు కోరారు.

కూటమి పార్టీలను ఓడించాలి

కాకినాడ రూరల్: కూటమి పార్టీలను ఓడించాలని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ తెలియజేశారు. బీజేపీకి అధిక ఎంపీ స్థానాలు ఇస్తే రాజ్యాంగాన్ని మార్చాలని బీజేపీ చూస్తుందని ఆయన ఆరోపించారు. ఏపీలో బీజేపీ దానికి మద్దతు ఇస్తున్న జనసేనను ఓడించాలని తాము ప్రచారం చేస్తున్నట్టు గురువారం కాకినాడ రూరల్ తిమ్మాపురంలో ఆయన తెలిపారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

కాకినాడ రూరల్: మండలంలో బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన పింఛన్లు మినహా మిలిగినవి ఇంటింటికీ వెళ్లి అందించినట్టు గురువారం సాయంత్రానికి 93 శాతం పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ రమేష్ నాయుడు తెలియజేశారు. మండలంలో మొత్తం 18,543 మంది లబ్ధిదారులకు రూ.5.47 కోట్లు పింఛన్లగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈసీ ఆదేశాల మేరకు లబ్ధిదారులు 14292 మందికి బ్యాంక్ ఖాతాల్లోకి సొమ్ములను ప్రభుత్వం జమ చేసిందన్నారు. మిగిలిన 4251 మందికి రూ.1.23 కోట్లు నేరుగా సచివాలయ సిబ్బంది సహకారంతో లబ్ధిదారుల ఇంటి వద్ద అందిస్తున్నామన్నారు. బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన పింఛన్ సొమ్ములను డ్రా చేసుకుంటున్నారని, గ్రామాల్లో బ్యాంకుల బిజినెస్ పాయింట్ల నిర్వహకులు పింఛన్ సొమ్ములు అందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు.

కూటమి ఎన్నికల ప్రచారం

కరప: గ్రామంలో గురువారం జనసేన కాకినాడ రూరల్ నియోజకవర్గ అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ కూటమి నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, నియోజకవర్గ టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, పేపకాయల సత్తిబాబు, జేఎస్‌పీ నాయకుడు పంతం సందీప్, భోగిరెడ్డి గంగాధర్, ముద్రగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో జీవన ప్రమాణాలు మెరుగు



మడికి సోనియా

సామర్లకోట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలతో పాటు క్రైస్తవులకు గుర్తింపు వచ్చిందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దివంగతనేత రాజశేఖరరెడ్డి వారసునిగా 2019లో ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా 2024 ఎన్నికలల్లో మేనిఫెస్టో రూపొందించారని తెలిపారు. సీఎం జగన్ ప్రకటించన మేనిఫెస్టో ఒక భగవద్గీత, ఖురాన్, బైబిల్ వంటి పవిత్ర గ్రంథాలుగా భావిస్తున్నారని చెప్పారు. అటువంటి పార్టీ తరఫున పోటీ చేసే నాయకులను గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరూ ఫ్యాను గుర్తుపై ఓట్లు వేయాలని పిలుపు నిచ్చారు.

అభివృద్ధి బాటలివిగో..



- ఐదేళ్లలో ప్రభుత్వ విజనరీ ఇది
- కొత్త రూపు సంతరించుకున్న ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రజలకు అందుబాటులో సేవలు
- బాపూజీ కలలు సాకారం చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 78 గ్రామ సచివాలయాలు

కాకినాడ రూరల్: ఒకప్పుడు గ్రామ పంచాయతీ కార్యాలయం అంటే ఓ పాడుబడిన భవనం.. దానిలో అస్తవ్యస్తంగా ఫైళ్లు.. జాయింట్లు విరిగిపోతే అతుకులు వేసిన టేబుళ్లు, కుర్చీలు వగైరా కనపడేవి. నేడు ఆ పరిస్థితి ఎక్కడా కనపడదు. ప్రతిచోటా కార్పొరేట్ లుక్ కనిపిస్తోంది. నూతన భవనాలు, మౌలిక వసతులు, సచివాలయంలో అన్ని విభాగాలకు సుమారు పది మంది ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. నియోజకవర్గంలో 3.11 లక్షల పైబడి జనాభా ఉన్నారు. రూరల్ మండలంలో 18 పంచాయతీలు, కరప మండలంలో 23 పంచాయతీలు అర్బన్‌లో 8 డివిజన్లు ఉన్నాయి. అర్బన్‌లో ప్రజలకు సేవల కోసం వార్డు సచివాయలాలు 16, గ్రామాలలో సేవల కోసం గ్రామ సచివాలయాలు కాకినాడ రూరల్‌లో 41, కరపలో 21 అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో సచివాలయ భవనానికి సుమారు రూ.40 లక్షలు మంజూరు చేశారు. నియోజకవర్గంలో సచివాలయ భవనాలకు సుమారు రూ.31 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. రూరల్ మండలంలో 41 గ్రామ సచివాలయాలకు 40 భవనాలు మంజూరు కాగా 31 పూర్తయ్యాయి. 9 వివిధ దశల్లో ఉన్నాయి. కరప మండలంలో 21 గ్రామ సచివాలయాలకు 14 పూర్తికాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. అర్బన్‌లో 16 వార్డు సచివాలయాలకు 6 భవనాలు పూర్తయ్యాయి.

దేశంలోనే ఆదర్శం

దేశంలోనే ఆదర్శంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థలు నిలిచాయి. ప్రభుత్వ ఐదేళ్ల పాలనకు ఇదో సువర్ణ అధ్యాయనం. గ్రామాలలో పర్యటిస్తే అత్యంత సుందరంగా ఆధునికంగా సచివాలయ భవనాలు దర్శనమిస్తున్నాయి. ఇది కళ్లెదురుగా కనిపించే అభివృద్ధి. వాటితో పాటు పక్కనే విలేజ్ క్లినిక్‌లు, ఆర్బీకేలు, మిల్క్ కలెక్షన్ సెంటర్లకు భవనాలు అందుబాటులోకి వచ్చాయి.

> **ప్రజలకు చేరువగా సేవలు**
>
> 
>
> గ్రామ సచివాలయాలతో ప్రజలకు సేవలు చేరువయ్యాయి. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వీఆర్వో తదితరులు ప్రజలకు అందుబాటులో ఉండడంతో వలన పనులు సకాలంలో పూర్తవుతున్నాయి. నేమాంలో సచివాలయ భవనంతో పాటు అన్ని భవనాలు ఒకే చోట నిర్మించడంతో ఆదర్శంగా నిలుస్తున్నాయి.
>
> – రామదేవు సూర్య ప్రకాశరావు, సర్పంచ్, నేమాం

ఈవీఎంల పంపిణీ ఏర్పాట్ల పరిశీలన



సిబ్బందికి సూచనలు ఇస్తున్న పరిశీలకుడు గణేష్, ఆర్వో వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీకి సంబంధించి మైక్లారిన్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు గురువారం సందర్శించారు. ఎన్నికలకు ముందు రోజు ఈవీఎం, వీవీ ప్యాట్, ఇతర ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. 22 కౌంటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఆయా కౌంటర్ల ద్వారా సామగ్రి పంపిణీకి సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఆయన అధికారులతో చర్చించారు. 234 పోలింగ్ బూత్‌లకు సంబంధించి హాజరయ్యే సిబ్బందికి కల్పించాల్సిన వసతి, ఇతర ఏర్పాట్లపై ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి స్మార్ట్ సిటీ ఎస్ఈ పి. వెంకటరావు, ఏఈ రమేష్ బాబు సర్వేయర్ ఆచార్యులు, అమృత డీఈ శ్రీనివాస్, ఇతర ఎన్నికల అధికారులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

ఎన్నికల విధులపై శిక్షణ

కాకినాడ: ఎన్నికల విధులపై పీఓ, ఏపీఓలకు గురువారం శిక్షణ ఇచ్చారు. స్థానిక పీఆర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి తొలి రోజు 250 మంది హాజరయ్యారు. నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షణలో మాస్టర్ ట్రైనర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల నిర్వహణ, ఎన్నికల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, విధులపై అవగాహన కల్పించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్ శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి పివో ఏపీఓలకు సూచనలు ఇచ్చారు. ట్రైనీ కలెక్టర్ హెచ్.ఎస్.భావన శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ ఎన్నికల విధులపై సిబ్బంది సమగ్రంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో 250 మందికి శుక్రవారం శిక్షణ కొనసాగుతుందన్నారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత భగవద్గీత శిక్షణ తరగతులు

బోట్‌క్లబ్: బాల సంస్కార శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి మే నెలాఖరు వరకూ ఉచిత భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గరమెళ్ల అన్నపూర్ణయ్యశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్ ఓటీటివారి వీధిలోని ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు భగవద్గీత, నీతి పద్యాలు, శ్లోకాలు, దేశభక్తి పాటలు నేర్పడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9490883905 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

భారీ విజయం అందించండి



రమణయ్యపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల
- రమణయ్యపేటలో విస్తృత ప్రచారం
- మోటారు సైకిళ్లతో అభిమానుల ర్యాలీ

కాకినాడ రూరల్: భారీ మెజార్టీతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా తనకు విజయం అందించాలని వైఎస్సార్ సీపీ అభ్యర్థి కురసాల కన్నబాబు రమణయ్యపేట గ్రామస్తులకు విన్నవించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం సాయంత్రం రమణయ్యపేటలో ఆయన ప్రచారం చేశారు. గ్రామంలో రాయుడుపాలెం బర్మాకాలనీ కాళికాదేవి ఆలయం నుంచి కొత్తూరు జంక్షన్, ఎస్సీ పేట, సిద్ధార్థ నగర్, టీచర్స్ కాలనీ రాయుడుపాలెం, శేషాద్రినగర్, రాయుడుపాలెం జంక్షన్, ఏపీఎస్పీ, ఆంజనేయనగర్ బాపన్నదొర కాలనీ, ఈశ్వర్‌నగర్, ఏపీఐఐసీ కాలనీ దండుపుంత, మురళీధర్ నగర్, ఇందిరాకాలనీ, ఎస్ఆర్ఎంటీ మీదుగా సర్పవరం జంక్షన్, తదితర ప్రాంతాలలో ఆయన ప్రచారం వాహనంపై ర్యాలీలో నిర్వహించారు. తమ అభిమాన నాయకుడు, ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబుకు మద్దతుగా గ్రామంలోని సచివాలయాలు 1, 2, 3, 4 పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మోటారు సైకిళ్లతో ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అడుగడుగునా కన్నబాబుకు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎదురొచ్చి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలు జగన్‌తోనే సాధ్యమన్నారు. ఐదేళ్లలో పథకాల అమలును చూసిన ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారన్నారు. ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగా సత్తిబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, వర ప్రసాద్, బుల్లియ్య, స్టీఫెన్ ఆనంద్, విలియమ్స్, లక్ష్మణదొర, కొత్తపల్లి గిరీష్, రేఖారెడ్డి, తిరగటి లక్ష్మి, రామిరెడ్డి, ధర్మారావు, నామాడి సత్యనారాయణ, ప్రసాదరాజు, శర్మ, మాజీ మేయర్ సరోజ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అన్ని విధాలా తోడుంటా

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సముద్రవేట జీవనాధారంగా పనిచేసే మత్స్యకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పర్యవేక్షణలో గురువారం తన నివాసంలో సమైక్య మత్స్యకార వాడబలిజ సంక్షేమ సంఘ ప్రతినిధి సూరాడ చిన్నారావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనల నుంచి సుమారు వంద మంది మత్స్యకారులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో మత్స్యకారులను ఓటు బ్యాంక్‌గా వాడుకున్నారే తప్ప వీరి సమస్యల పరిష్కారంపై చిత్తశుద్ధి చూపలేదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తమ ప్రభుత్వంలో మత్స్యకార భరోసా అందించడంతో పాటు, ఓఎన్‌జీసీ పరిహారాన్ని ఇప్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించిన వెంటనే చమురు సంస్థల ద్వారా అందించాల్సిన పరిహారంపై ప్రత్యేక దృష్టి పెట్టి న్యాయం చేస్తామన్నారు.

12వ డివిజన్ నుంచి చేరికలు

స్థానిక 12వ డివిజన్ పర్లోపేటకు చెందిన టీడీపీ, జనసేనలో క్రియాశీలకంగా పనిచేసే కార్యకర్తలు స్థానిక నాయకులు బొదిరెడ్డి పుష్పపరశురాం ఆధ్వర్యంలో ద్వారంపూడి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పర్లోపేటలోని వాడపేటకు చెందిన సుమారు 300 మంది పార్టీలో చేరారు. చోడిమిల్లి గొర్లయ్య, రాగతి సత్తిబాబు, రవి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా కష్టించి పనిచేయాలని పిలుపునిచ్చారు. జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారంపూడికి మద్దతుగా ప్రచారం

వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడికి మద్దతుగా ఆయన కుటుంబ సభ్యులు గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన కుమార్తె డాక్టర్ ప్రణీత 36వ డివిజన్‌లోని దుగ్గిరాల వారివీధి, గంజాంవారివీధి, వినుకొండవారివీధి, కొమ్మిరెడ్డివారి వీధి ప్రాంతాల్లో, అల్లుళ్లు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఉదయ్‌శేఖర్‌రెడ్డి తదితరులు 41, 40 వార్డుల్లో ప్రచారం చేశారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి వెంకట్, రాగం విక్రమ్, సత్యనారాయణరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బసవా అశోక్, మాజీ కౌన్సిలర్ శర్మ తదితరులు ఉన్నారు.



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి







ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత, అల్లుళ్లు హర్షవర్ధన్‌రెడ్డి, ఉదయ్‌శేఖర్‌రెడ్డి

సంక్షేమాభివృద్ధికి ఓటు వేయండి



ఏఎస్ఆర్ కాలనీలో ఓట్లు అభ్యర్థిస్తున్న మత్స్యకార నాయకులు, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్

కాకినాడ సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన, అభివృద్ధి పనులను దృష్టిలో పెట్టుకుని ఓటు వేయాలని జిల్లా మత్స్యకార సంఘ నాయకులు, తూరంగి మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. గురువారం తూరంగిలోని ఏఎస్ఆర్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, నాయీ బ్రాహ్మణ కాలనీ, విముక్తి కాలనీ, పగడాలపేట తదితర ప్రాంతాల్లో వందలాది మంది ప్రజలు వెంటరాగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూటకపు హామీలతో రెచ్చగొట్టే వైఖరితో కూటమి అభ్యర్థులు అధికారంలోకి రావాలని చూస్తున్నారని, అటువంటి వారికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని ప్రసన్నకుమార్ ప్రజలను కోరారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసేందుకు తూరంగిని రూ. కోట్లాది వ్యయంతో అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కాలనీల్లో ప్రతి గడప గడపకు వెళ్లి ఎమ్మెల్యేగా కన్నబాబుకు, ఎంపీగా చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రసన్నకుమార్ ఓటర్లను అభ్యర్థించారు. ఈయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు జగడం శ్రీహరి, కాకి రాజు, దండుప్రోలు సత్యనారాయణ తదితరులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

5న 'హోమ్ ఓటింగ్'

ఏర్పాట్లపై ఆర్ఓ సమీక్ష



హోమ్ ఓటింగ్ ప్రక్రియను సమీక్షిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: దివ్యాంగులు, 86 ఏళ్ల వృద్ధుల కోసం ఈ నెల 5వ తేదీన 'హోమ్ ఓటింగ్' అవకాశం కల్పిస్తున్నట్లు సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై రూట్ ఆఫీసర్లతో గురువారం సాయంత్రం తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ కోసం 43 మందిని గుర్తించామన్నారు. వీరి ఇంటి వద్దకే వెళ్లి ఓటు వేయించేందుకు ఐదు రూట్‌లుగా విభజించామన్నారు. హోమ్ ఓటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైన సూచనలు ఇచ్చారు. ఐదో తేదీన ఒక్కరోజు మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని పరిస్థితుల్లో ఉన్న వారి కోసం ఈ హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరుగుతోందని స్పష్టం చేశారు.

టీడీపీలో వర్గపోరు

కాకినాడ: కాకినాడ 41వ డివిజన్ టీడీపీ వర్గపోరుకు వేదికై ంది. పట్టాభివీధిలో ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థి వనమాడి సమక్షంలోనే అక్కడి స్థానిక నాయకులు ఆధిపత్యం కోసం తోపులాటకు దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ డివిజన్‌లోని ఇరువర్గాలకు చెందిన నేతలు పరస్పరం కొండబాబు సమక్షంలో దూషించుకున్నారు. నిన్నకాక మొన్న వచ్చి మాపై పెత్తనం ఏమిటంటూ ఓ వర్గానికి చెందిన ప్రతినిధి మరో వర్గంపై విరుచుకుపడ్డారు. ఓ దశలో తోపులాటకు దిగారు. అసలే డివిజన్‌లో అంతంతమాత్రంగా ఉన్న పార్టీ పరిస్థితి అక్కడి నేతల మధ్య కొట్లాట టీడీపీ నేతలకు తలనొప్పిగా మారింది. వనమాడి సముదాయించే ప్రయత్నం చేసినా ఏ ఒక్కరూ వెనక్కి తగ్గలేదు.

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి

కరప: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలతో జనరంజక పాలన అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, అందుకు ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ, పార్లమెంట్ సభ్యులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలుచేశారని ఓటర్లకు వివరిస్తూ ప్రచారం చేశారు. 2024 ఎన్నికల్లో అమలుచేసే వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను వివరిస్తూ గ్రామాల్లో కరపత్రాలను పంచిపెట్టారు. ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి కాకినాడరూరల్ అసెంబ్లీనియోజకవర్గ అభ్యర్థి కురసాల కన్నబాబును, కాకినాడపార్లమెంట్ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలపించి తద్వారా జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్ల అభ్యర్థించారు. వేములవాడలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ కమిడి మంగాదేవి, కరప సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, గ్రామకమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, పాతర్లగడ్డలో సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, గొర్డటిపాలెంలో సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, యండమూరులో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు ప్రచారం చేశారు.



వేములవాడలో బ్యాలట్ నమూనాతో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మద్యం విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా

- తరలించే వాహనాలకు జీపీఎస్
- అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులు
- ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు



ఓ మద్యం దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కాకినాడ క్రైం: ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలపై జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కట్టుదిట్టమైన నిఘా పెట్టింది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే విక్రయాలు జరుగుతున్నా పూర్తి స్థాయి నిఘా కొనసాగిస్తున్నామని ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ గురువారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సైజ్ ఎస్సైలు, డీసీ స్క్వాడ్, ఈఎస్ స్క్వాడ్‌లు తరచుగా ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు, బార్ అండ్ రెస్టారెంట్లు, ఆర్ఎస్, డీఎస్, మిథనాల్, మొలాసిస్ యూనిట్లను తనిఖీ చేస్తున్నాయని తెలిపారు. మద్యం కొనుగోలు చేస్తున్న వారు ఎంత మొత్తంలో కొంటున్నారు, ఎక్కడికి తరలిస్తున్నారనే అంశాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామన్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం దుకాణాల్లో సీసీ కెమెరాల నిఘా తప్పనిసరి చేశామని తెలిపారు. వీటిని నేరుగా రాష్ట్ర కంట్రోల్ రూముకు అనుసంధానం చేశామని పేర్కొన్నారు. డిస్టిలరీలు, డిపోల నుంచి మద్యం దుకాణాలు, బార్లకు మద్యం తరలించే ప్రతి వాహనాన్నీ జీపీఎస్‌తో అనుసంధానం చేశామని తెలిపారు. అక్రమ మార్గాల్లో మద్యం విక్రయాలు, తరలింపు, ఇతర నిబంధనల ఉల్లంఘనలపై సమాచారం సేకరించి, తక్షణ చర్యల కోసం కాకినాడ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని వివరించారు. తాజా తనిఖీల్లో 52,752 ఎన్‌డీపీఎల్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసులు నమోదు చేశామన్నారు. ఆధునీకరించిన ల్యాబ్‌లలో పూర్తి స్థాయి పరీక్షలు చేపట్టిన తర్వాతే దుకాణాల్లో మద్యం విక్రయిస్తున్నామన్నారు. అన్ని ప్రభుత్వ దుకాణాలలో డిజిటల్ పేమెంట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎన్‌డీపీఎల్ రవాణా, ఇతర మాదక ద్రవ్యాల తరలింపు క్రయవిక్రయాలపై అందే ఎటువంటి సమాచారం ఉన్నా తక్షణమే కంట్రోల్ రూము నంబర్ 0884–2376227కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.